భూసార పరీక్షలకు సర్వం సిద్ధం

- ఇదే మంచి సమయం అంటున్న నిపుణులు
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



యలమంచిలిలో మట్టిని సేకరిస్తున్న వ్యవసాయాధికారులు



సేకరించిన మట్టిని ప్లాస్టిక్ కవర్లలో కడుతున్న సిబ్బంది

యలమంచిలి: భూమి సారవంతంగా ఉంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే సాగు భూమి పరిస్థితిని భూసార పరీక్షలు ద్వారానే తెలుసుకోవచ్చని పేర్కొంటున్నారు. ప్రస్తుతం దాళ్వా కోతలు పూర్తవుతున్న నేపథ్యంలో భూసార పరీక్షలు చేయించడానికి ఇదే సరైన సమయమని వివరిస్తున్నారు. రైతులు సాగులో అధికంగా రసాయనిక ఎరువులు వినియోగించడంతో పంట దిగుబడులు క్రమేపీ తగ్గిపోతున్నాయి. రసాయనిక ఎరువులు అధిక వినియోగంతో భూములు సారాన్ని కోల్పోతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎరువులను అధికంగా వాడకుండా, పొలాల్లో భూసారం పెంపొందించేందుకు భూసార పరీక్షలు తప్పనిసరని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 2024–25 సంవత్సరంలో యలమంచిలి మండలంలో 920 ఎకరాల్లో భూసార పరీక్షలు నిర్వహించాలని లక్ష్యం కాగా గత దాళ్వా పంటకు ముందు 11 ఎకరాల్లో భూసార పరీక్షలు నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి చెప్పారు. ఇప్పుడు మిగిలిన 809 ఎకరాల్లో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలు రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహాయంతో సేకరిస్తున్నట్లు ఆమె వివరించారు. భూసార పరీక్షల వల్ల పొలాల్లో ఏ మేరకు ఎరువులను, సూక్ష్మ పోషకాలను వినియోగించుకోవాలో? తెలుస్తుందని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని చెబుతున్నారు.

మట్టిని సేకరించడం ఇలా..

- చౌడు, ఆమ్ల నేలల్లో ఇతర ఏ సమస్యాత్మక నేలల్లోనైనా వేర్వేరుగా మట్టి నమూనాలను సేకరించాలి. 15–30 సెం.మీ లోతులోని మట్టిని సేకరించాలి.
- చెత్తాచెదారం ఉంటే తొలగించి ×వీ౯ ఆకారంలో గొయ్యి తీసుకోవాలి. ఒకే మందంలో పై నుంచి కింద వరకు పలుచగా పొరలుగా తీసుకుని మట్టి సేకరించాలి.
- జిగ్ జాగ్ పద్ధతిలో ఎకరాకు 8 నుంచి 10 చోట్ల రెండు కిలోల మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిని గోనే సంచిపై వేసి నీడలో ఆరబెట్టి, మట్టి గడ్డలుంటే చిదిమేయాలి. అనంతరం ఆ మట్టిని నాలుగు భాగాలుగా వేసుకొని ఒక్కో భాగం నుంచి కొంత మట్టిని తీసుకొని కిలో మట్టిని తయారు చేసి నమూనాకు పంపాలి.
- వేసే పంటను బట్టి నమూనా సేకరణ మారుతుంది. స్వల్ప కాలిక పంటలకు 15/20 సెంటిమీటర్ల లోతు తీయాలి. తోట పంటలకు 3/4 అడుగులు తీయాలి.

పోషక లోపాలను గుర్తించడం కీలకం

- భూసార పరీక్ష ఫలితం ఆధారంగా స్థూల, సూక్ష్మ పోషకాల విలువను తెలియజేస్తూ వాటి ఆధారంగా ఏ పంటలు వేయాలి, ఎలాంటి ఎరువులు వాడాలో రైతులకు సిఫారసు చేస్తారు.
- స్థూల, సూక్ష్మ పోషకాలుగా పిలిచే నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, బోరాన్, సల్ఫర్, కాల్షియం, మెగ్నీషియం, జిప్సం లోపిస్తే పంటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి.
- భూసార పరీక్షలు చేయిస్తే ఈ లోపాన్ని గుర్తించేందుకు వీలుంటుంది. లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకొని దిగుబడిని పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.
- పోషక లోపాలను నివారించడానికి జిప్సం, జింక్, పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయాలి.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాల సేకరణకు అనువైన సమయమిది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహాయంతో భూసార పరీక్షలు చేయిస్తున్నాం. భూసార పరీక్షలకు అనువైన మట్టి నమూనాను మాత్రమే సేకరించాలి. భూసారాన్ని గుర్తించి వాటికి అనుగుణంగా ఎరువులు వాడకం, పంటల సాగుపై రైతులకు సూచనలు ఇస్తున్నాం. భూసారం పెరగడం వల్ల ఎరువుల వాడకం ఖర్చు తగ్గుతుంది.
– చిందులూరి దేవి, మండల వ్యవసాయాధికారి, యలమంచిలి

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



జవదాలపేటలో చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

నరసాపురం: పట్టణంలో 31వ వార్డు జవదాలపేటలో సోడదాసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ అయితం సత్యనారాయణ ప్రారంభించారు. పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాలల ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్ తమ తల్లిదండ్రులు సోడదాసి ఆర్థన్ బెన్ని, వాంతమ్మల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు కార్యక్రమంలో సోడదాసి రత్నశేఖర్, వర్ధనపు ఏసురత్నం, పిల్లి ప్రదీప్, నల్లి రాజేష్ పాల్గొన్నారు.

నేడు యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలో వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలను సభ్యులకు వివరిస్తామని పేర్కొన్నారు. అలాగే రాబోయే మూడు నెలల కాలంలో చేపట్టే పనుల గురించి చర్చిస్తామని వివరించారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు ఆలమూరులో విశ్వేశ్వరస్వామి కళ్యాణం



కల్యాణానికి అంకురార్పణ చేస్తున్న కొవ్వూరి సత్తిరెడ్డి దంపతులు

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరులో ఉన్న శ్రీ పార్వతి సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణం గురువారం సాయంత్రం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు రాయబారం రాజా సూర్య కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. కల్యాణోత్సవాలకు సంబంధించి అంకురార్పణ కార్యక్రమాన్ని బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ కొవ్వూరి సత్తిరెడ్డి పద్మావతి దంపతులు గణపతి పూజ చేసి ప్రారంభించారు. గురువారం ఉదయం ఏకాదశి పురస్కరించుకుని ముందుగా స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం గ్రామోత్సవం, సాయంత్రం శ్రీ పుష్ప యోగక్షం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పెనుగొండ అభివృద్ధికి తీర్మానాలు



పెనుగొండ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ గ్రామాభివృద్ధికి పలు ప్రతిపాదనలు చేసినట్లు గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో 39 తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులపై పంచాయతీ సభ్యులతో చర్చించి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. సమావేశంలో పంచాయతీ సభ్యులతో పాటు, గ్రామ కార్యదర్శి టి.రత్నాకరరావు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల మెరుగుకు కృషి



పెనుమంట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న డి.మురళి సత్యనారాయణ

పెనుమంట్ర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుకు మరింత కృషి చేస్తామని నరసాపురం డీవైఈఓ డి.మురళి సత్యనారాయణ అన్నారు. బుధవారం అయిన పెనుమంట్ర విద్యాశాఖ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి అనంతరం ఉన్నత పాఠశాలలో సప్లమెంటరీ పరీక్షలు కోసం జరుగుతున్న ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి ఉంగరాల నాగేశ్వరరావు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

పెనుగొండ: మండలంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బుధవారం ఎంఈఓ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రథమ స్థానం సాధించిన పాతంశెట్టి శ్రీలేఖ (583), ద్వితీయ స్థానం సాధించిన మానుపాటి దేవి ప్రసన్న(578), తృతీయ స్థానం సాధించిన కాంద్రేకుల యువరాణి(577), వై.గణపతి(577)లను సత్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి బండి ప్రసాద్, ఎ.ఉషారాణి, పి.రాజేంద్ర ప్రసాద్, దేవీ ప్రసాద్, కేజశిరాజు కృష్ణ, ముత్తాబత్తుల త్రిమూర్తులు తదితరుల పాల్గొన్నారు.

సిద్ధాంతంలో గ్రామోత్సవం



సిద్ధాంతంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న వాసవీ భక్తులు

పెనుగొండ: వాసవీ కన్యకపరమేశ్వరి జయంతిని సిద్ధాంతంలో వైభవంగా నిర్వహించారు. వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వాసవీ మాతను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ పెద్దలు, మహిళా మండల సభ్యులు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి



సీపీఎం కార్యాలయం అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆచంటలో అల్లూరికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

యలమంచిలి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ కోరారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం పాలకొల్లు సీపీఎం కార్యాలయం వద్ద అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ పేదల స్వాతంత్ర్యం కోసం పని చేసి ప్రాణాలర్పించిన అల్లూరి పుట్టిన గ్రామంలో నేటి ప్రభుత్వ పాలకులు పేదల ఇళ్లు కూల్చుతున్నారని విమర్శించారు. బ్యాంకులకు టోపి పెట్టిన వారే పెత్తందారుల కోసం పేదలపై ప్రతాపం చూపుతున్నారన్నారు. పాలకోడేరు అల్లూరి సీతారామరాజు కాలనీలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయం చూపి న్యాయం చేయాలని రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, వై అజయ్‌కుమార్, చల్లా సోమేశ్వరరావు, ఎస్.పురుషోత్తం, తిరుమాని శ్రీనివాస్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జీవీఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో

విప్లవ వీరుడు అల్లూరి 102వ వర్ధంతిని పాలకొల్లు పట్టణ పరిధిలోని జీవీఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కరణం పాపారావు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కవులు రైతు సంఘ అధ్యక్షుడు కోసం సుబ్బరాజు అన్నారు. సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలువేసిన నివాళులర్పించారు. యువత ఆయన అడుగుజాడల్లో నడిచి దేశ రక్షణకు పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం నాయకులు మంతెన రామదిరాజు, జంపన సతీష్, చిటికెన రాంబాబు, బొమ్మిడి ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి తక్షణం విడుదల చేయాలి

పెనుగొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి తక్షణం విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆచంట కొత్తూరు సెంటర్ ఉయ్యాలతాళ్ల వద్ద డీవైఎఫ్ఐ బాల సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలపై నోరు మెదపడం లేదని మండిపడ్డారు. నిరుద్యోగులు సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకొన్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో సాంకేతిక సమస్యలతో అభ్యర్థులు సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చుంటూరి వెంకట సత్యనారాయణ, పి.మోహనరావు, తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, మేకా జోష్నిక, మేకా పునర్నవి, ఒబిలిశెట్టి బావేష్, ఎ.ప్రదీప్, పి.అంజలి, టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులు బెంబేలు



కాంబొట్లపాలెంలో ధాన్యంపై బరకాలు కప్పుతున్న మహిళలు



గుంపర్రులో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

యలమంచిలి: అకాల వర్షం రైతులను బెంబేలెత్తించింది. ఉదయం నుంచి ఎండ విపరీతంగా కాయడంతో వరి కోత యంత్రాలతో వరి కోసిన రైతులంతా కళ్లాలలో ధాన్యాన్ని ఎండబెట్టారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాతావరణలో హఠాత్తుగా మార్పు వచ్చి కాంభొట్లపాలెం, గుంపర్రు, ఇలపకుర్రు, చింతదిబ్బ తదితర గ్రామాలలో ఒక్కసారిగా వర్షం పడింది. దీంతో ధాన్యం ఎండబెట్టిన రైతులంతా ఉరుకులు పరుగులు పెట్టి ధాన్యంపై బరకాలు కప్పడానికి అవస్థలు పడ్డారు. నాలుగు రోజుల క్రితం ఇలాగే అకస్మాత్తుగా కురిసిన వర్షానికి ఇబ్బందులు పడిన రైతులు మళ్లీ వాతావరణం పగ బట్టినట్లు వర్షం కురవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజీబీఎస్ మహిళా కళాశాలను కాపాడుకుంటాం



సర్విశెట్టి విగ్రహానికి పాలాభిషేకం చేస్తూ పాలకవర్గం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

నరసాపురం: మహోన్నత ఆశయంతో పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి స్థాపించిన బీజీబీఎస్ మహిళా కళాశాల ఆస్తులను ప్రజల భాగస్వామ్యంతో పోరాటం చేసి కాపాడుకుంటామని ఆర్యవైశ్య సంఘ నాయకుడు కోట్ల రామ్‌మోహన్ అన్నారు. బుధవారం రాయిపేటలోని కళాశాల వ్యవస్థాపకుడు సర్విశెట్టి విగ్రహం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, అలాగే కళాశాల అధ్యక్షుడు, ట్రెజరర్‌లు నకిలీ తీర్మానాలు చేసి కళాశాల ఆస్తులను అమ్ముతున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి వితంతు పునర్వివాహాల ఉద్యమం నడిపి, బ్రహ్మచారిగా ఉండి తన జీవితాంతం మహిళల అభ్యుదయానికి పాటుపడిన సర్విశెట్టి స్థాపించిన కళాశాల ఆస్తులు అమ్మడం దారుణమని మండిపడ్డారు. ఆర్యవైశ్య ప్రముఖులు కూడా కళాశాల పాలకవర్గం తీరును హర్షించరని చెప్పారు. వైఎస్సార్ సీపీ నేత కావలి నాని మాట్లాడుతూ కళాశాలకు ప్రభుత్వం, దాతలు ఇచ్చిన విలువైన ఆస్తులు అమ్మడం ఏంటి? అని ప్రశ్నించారు. పాలకవర్గం చేస్తున్న అన్యాయంపై అధికారులకు తాను ఇప్పటికే ఫిర్యాదు చేశానన్నారు. కళాశాల అధ్యాపకురాలు ఝాన్సీ మాట్లాడుతూ కళాశాలను ఎయిడెడ్ కాకుండా సాంకేతిక అంశాలను వాడుకుని కళాశాల అభివృద్ధిని నూలి శ్రీనివాస్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. 25 ఏళ్లుగా పని చేస్తున్న తమకు రూ 4వే లు జీతం ఇస్తున్నారని వాపోయారు. ముందుగా సర్విశెట్టి విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. సర్విశెట్టి ఆశయాలకు తూట్లు పొడవద్దని, పాలకవర్గం విధులు నుంచి తప్పుకోవాలని నినాదాలు చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, బర్రి శంకరం, శిరిగినీడి వెంకన్న,యర్రా శ్రీను, గన్నాబత్తుల సందీప్, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, మండ రాజా, కొడవీటి వెంకటేశ్వరరావు, నిప్పులేటి సత్యనారాయణ, టి.విజయ్‌కుమార్, చవల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్లు, శిక్షణ పేరుతో పెద్ద స్కామ్



పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి పెద్ద పీట వేస్తామని చెబుతూ వారికి కుట్టు శిక్షణ, మెషీన్లు పంపిణీ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయల భారీ స్కామ్‌కు శ్రీకారం చుట్టిందని వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్ర వీరన్న అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుట్టు మెషీన్ ట్రైనింగ్ పేరుతో భారీ అవినీతికి పాల్పడుతుందని ఆయన అన్నారు. కుట్టు మిషన్లకు, ట్రైనింగ్‌కు సంబంధించి ఒక్కో లబ్ధిదారుడికి ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ.23,000 అయితే కుట్టు మెషీన్ కొనుగోలు ఖర్చు రూ.4,300, శిక్షణ నిమిత్తం అవుట్ సోర్స్ కాంట్రాక్టు ఖర్చు రూ.3,000 రూపాయలు మొత్తం రూ.7,300 ఖర్చుపెట్టి రూ.15,700ను అవినీతి చేస్తున్నారని ఆయన అన్నారు. ఒక లక్ష కుట్టు మెషీన్లకు గానూ రూ.73 కోట్లను ఖర్చు పెట్టి రూ.157 కోట్లను దోపిడీ చేస్తున్నారు. అదేవిధంగా కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, కాపు కార్పొరేషన్ కింద మరో రూ.81.5 కోట్లను దోచుకోవడానికి ప్రణాళికను సిద్ధం చేశారని ఆరోపించారు.

● పెనుగొండలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



మరకతశిల వాసవీ మాత



ఆకట్టుకున్న గరగ నృత్యాలు

ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు పెనుగొండలో వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వాసవీ మాత జయంతి కావడంతో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది వాసవీమాత దర్శనానికి తరలివచ్చారు. అలాగే వాసవీ శాంతి ధాం ఆధ్వర్యంలో ఉదయం నుంచి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. – పెనుగొండ



ఆలయానికి కలశాలతో వస్తున్న మహిళలు